క్లుప్తంగా

పెద్దమ్మ తల్లి దీవెనలు ఉండాలి : పల్లా



పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): పెద్దమ్మ తల్లి దీవెనలు ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రేబర్తి గ్రామంలో పెద్దమ్మ తల్లి కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే పెద్దమ్మ తల్లిని దర్శించుకొని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి దీవెనలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నామన్నారు. ఆయన వెంట ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీ మల్లిపెద్ది సుమలత, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో బీఎల్‌ఓలు విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ సందీప్

దుబ్బాక: పార్లమెంట్ ఎన్నికల్లో బీఎల్‌ఓలు సయన్వయంతో విధులు నిర్వహించాలని డిప్యూటీ తహసీల్దార్ సందీప్ అన్నారు. గురువారం దుబ్బాక ఐసీడీఎస్ కార్యాలయంలో ఎన్నికల విధులపై బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు హోం పోలింగ్‌పై దృష్టి సారించాలన్నారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు భారత ఎన్నికల సంఘం ఇంటి వద్దనే ఓటింగ్ ప్రక్రియ జరిగేలా అవకాశం కల్పించిందన్నారు. గ్రామాల్లో దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడినవారిని గుర్తించి ఫారమ్ 12డి ని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు నర్సింహారెడ్డి, నరేందర్, సిబ్బంది జావేద్, రవీందర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు



అవార్డులు ప్రదానం చేసిన డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

హుస్నాబాద్: డిపో పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్టీసీ ఉద్యోగులకు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం అభినందన సభ నిర్వహించారు. జనవరి, ఫిబ్రవరి కిగాను ప్రగతి చక్ర అవార్డులు, జనవరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు నగదు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ శ్రీధర్, ట్రాఫిక్ సూపరింటెండెంట్ నర్సయ్య, మెకానిక్ సూపరింటెండెంట్ శామ్యూల్, అకౌంట్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

డీఆర్‌డీఓ జయదేవ్‌చార్య



పీర్లపల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డీఆర్‌డీఓ జయదేవ్ చార్య అన్నారు. గురువారం మండలంలోని పీర్లపల్లి, లింగారెడ్డిపల్లి, పీటివెంకటాపూర్, రాయవరం గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పని కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే నూతనంగా ఉపాధి జాబ్‌కార్డులు పొందిన వారికి కూడా పని కల్పిస్తామన్నారు. అనంతరం మండల కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, ఏపీఓ లక్ష్మీ, ఏపీఓ శ్రీనివాస్ వర్మ, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

తొగుట(దుబ్బాక): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. మండలంలోని ఎల్లారెడ్డిపేట క్రాస్ రోడ్డు వద్ద గురువారం ఎస్ఐ లింగం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నగదు, బంగారం వెంట తీసుకెళ్లేవారు రసీదులు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

కాలువ పూడ్చి.. వెంచర్ వేసి

డీటీపీసీ లేఔట్ పేరుతో ఆక్రమణలు

- గుగ్గిల్ల కుంట మత్తడి కాలువ కబ్జా
- పరిశీలించకుండానే డీటీపీసీ అనుమతులు



కాలువ పూడ్చి వెంచర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూ ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మల్లన్న ఆలయ పరిసరాల్లో వారు భూ వ్యాపారం చేస్తున్నారు. కుంటలు, చెరువు కాలువలను వదలడంలేదు. కాలువను పూడ్చి వెంచర్లు ఏర్పాటుచేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా అనుమతులు తీసుకొని ఫెన్సింగ్ వేశారు. వానాకాలంలో కురిసే వర్షాలకు మత్తడి కాలువ కొట్టుకుపోయి పంట పొలాలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడుపూలు ఆరుకాయలుగా సాగుతోంది. కొంతమంది భూ వ్యాపారులు కుంటలు, చెరువు కాలువలను వదలడం లేదు. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రానికి సమీపంలో ఉన్న రసులాబాద్ గ్రామంలోని సర్వే నంబర్ 258లో గుగ్గిల్ల కుంట మత్తడి కాలువను పూడ్చి కొంత మంది భూ వ్యాపారులు వెంచర్ చేయడంతో పాటు ఫెన్సింగ్ వేశారు. గుట్టు చప్పుడు కాకుండా 30 ప్లాట్ల కోసం డీటీపీసీ, గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకున్నారు. మత్తడి కాలువను పూడ్చి వెంచర్ ఏర్పాటైతే వానాకాలంలో మత్తడి కాలువ ప్రవాహానికి కొమురవెల్లి నుంచి అయినాపూర్ రోడ్డు కొట్టుకుపోవడమే కాకుండా సుమారు వంద ఎకరాలు ముంపునకు గురవతాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కబ్జా పర్వం కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. కాగా వెంచర్‌ను పరిశీలించకుండానే డీటీపీసీ అధికారులు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి గుగ్గిలకుంట మత్తడి కాలువ అన్యాక్రాంతం కాకుండా చూడాలని వెంచర్ ఏర్పాటు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నివేదిక పంపించాం

కొంత మంది భూ వ్యాపారులు గుగ్గిల్లకుంట కాలువను పూడ్చి వెంచర్ ఏర్పాటుకు ప్రయత్నించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కాలువను పునరుద్ధరించాలని వారిని ఆదేశించాం. కాలువ పరిశీలించి పూర్తి నివేదికను ఉన్నత అధికారులకు పంపించాం.

– వర్ధన్, ఏఈ ఇరిగేషన్

కాలువ పూడ్చడంతో రైతులకు నష్టాలు



గుగ్గిల్ల కుంట మత్తడి కాలువ పూడ్చి వెంచర్ ఏర్పాటు చేశారు. కాలువ పక్క రైతులకు భారీ నష్టం కలుగుతుంది. వెంటనే ఉన్నతాధికారులు వెంచర్ ఏర్పాటు చేసిన స్థలాన్ని పరిశీలించాలి. కాలువను ఎప్పటిలాగే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

– తేలు ఇస్తారి, మత్స్యసహకార సంఘం నాయకుడు

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



పొన్నాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న అత్తు ఇమామ్

సిద్దిపేట అర్బన్: ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలోని సర్వే నంబర్ 21లో 18 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లుగా చేసి అమ్ముకుంటున్న బీఆర్‌ఎస్ నాయకుడు, కబ్జాకు సహకరించిన తహసీల్దార్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం పొన్నాలలోని పోలీస్ కన్వెన్షన్ హాల్ సమీప స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. సిద్దిపేట నియోజకవర్గంలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయిందని, కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కురుమ సంఘం వెనుక భూములు కోల్పోయిన వారికి కేటాయించిన ప్లాట్లకు వెళ్లేందుకు దారి లేకుండా కబ్జా చేశారన్నారు. ఆయన వెంట పార్టీ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాసుద్దీన్ ఉన్నారు.

బీజేపీతోనే గిరిజనుల సాధికారత సాధ్యం



సమావేశంలో మాట్లాడుతూన్న నరేష్ నాయక్

మద్దూరు(హుస్నాబాద్): బీజేపీతోనే గిరిజనుల సాధికారత సాధ్యమవుతుందని భువనగిరి పార్లమెంట్ గిరిజన మోర్చా ప్రబారి భూక్య నరేష్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్యానాయక్ తండాలో గిరిజనుల ముఖ్య కార్యకర్తలతో సమావేశం జనగామ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి బానోత్ రామకోటి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గిరిజన మహిళను రాష్ట్రపతిని చేసిన ఘనత, మేడారం సమ్మక్క సారక్క గిరిజన యూనివర్సిటీని అందించిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రజలకు తెలియజేయాలన్నారు. పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ విజయానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, బీజేపీ నాయకులు ధరావత్ భిక్షపతి, శ్రీనివాస్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

దానాల్లో రక్తదానం గొప్పది

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్



రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: దానాల్లో రక్త దానం గొప్పదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. ఎన్ఎస్ఎస్, సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ మేనేజర్ డాక్టర్ రామ్మోహన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, ఎన్‌సీసీ కేర్ టేకర్ లెఫ్టినెంట్ మహేందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పల్లవి, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ రాణి, డాక్టర్ శ్రద్దానందం, డాక్టర్ మహేందర్, కృష్ణయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని వాసవీ నగర్‌లో ఉంటున్న ఆశన్నగారి కవిత తన ఇంట్లో బెల్ట్ షాప్ నిర్వహిస్తోందని విశ్వసనీయ సమాచారం అందింది. పోలీసు సిబ్బంది సోదాలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 13.32 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

శ్రీ సంతోషిమాత ఆలయ హుండీ లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. శ్రీ శరభేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి రవికుమార్, శ్రీ సంతోషిమాత ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథశర్మ, ఆలయ చైర్మన్ మాంకాల నవీన్‌కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో హుండీలను తెరిచారు. 2023 సెప్టెంబర్ 9 నుంచి 2024 మార్చి 21 వరకు హుండీ ఆదాయం రూ.1,76,177 వచ్చిందని కార్యనిర్వహణాధికారులు, ఆలయ చైర్మన్‌లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల సభ్యులు కొమురవెల్లి కల్యాణి, గాదగోని సత్యం గౌడ్, ఎక్స్‌అఫిషియో సభ్యులు శాకం మధుసూదన్ శర్మ, శ్రీ సంతోషిమాత సేవా సమితి సభ్యులు, మాత మండలి సభ్యులు, పూర్వ ధర్మకర్త మాధురి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లపై అభ్యంతరం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2023–24 విద్యా సంవత్సరం పూర్తి కాకముందే, జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు 2024–25 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు తీసుకుంటున్నాయంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ అభ్యంతరం తెలిపారు. గురువారం జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్లన్ ఆఫర్ పేరిట విద్యార్థుల తల్లిదండ్రులను కార్పొరేట్ పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు మోసం చేస్తున్నాయన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్, ఆముదాల రంజిత్ రెడ్డి, నాయకులు వంశీ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్

సామాజిక సేవే రోటరీ క్లబ్ లక్ష్యం

రోటరీ 3150 డిస్ట్రిక్ గవర్నర్ శంకర్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): సామాజిక సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ కృషి చేస్తుందని రోటరీ 3150 డిస్ట్రిక్ గవర్నర్ బి.శంకర్‌రెడ్డి అన్నారు. ములుగులో బుధవారం రాత్రి గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు కె.బాబుగౌడ్ అధ్యక్షతన కుట్టు శిక్షణ పొందిన 80 మంది మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామీణ మహిళలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, సెక్రటరీ నర్సింహారెడ్డి, ట్రెజరర్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, చంటి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

గజ్వేల్ ఐసీడీఎస్ సీడీపీఓ సరిత



రాయపోలులో మాట్లాడుతున్న సరిత



చెప్యాలలో సామూహిక సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

రాయపోలు(దుబ్బాక): పౌష్టికాహారం తీసుకోవడంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని గజ్వేల్ ఐసీడీఎస్ సీడీపీఓ సరిత అన్నారు. రాయపోలు మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పోషకాహార వారోత్సవాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. చిరుధాన్యాలు ఆహారంలో తీసుకుంటే తల్లులు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారన్నారు. మహిళల్లో రక్తహీనత నివారణకు చిరుధాన్యాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆయా గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షబానా, ఎస్ఐ రఘుపతి, ఎంపీహెచ్ఓ శ్రీనివాస్, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కలిగించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారంపై అవగాహన కలిగించాలని ఐసీడీఎస్ బ్లాక్ కోఆర్డినేటర్ శాంసన్ అన్నారు. మండల పరిధిలోని చెప్యాల అంగన్‌వాడీ–2 కేంద్రంలో గురువారం దుబ్బాక సెక్టార్ లెవల్‌లో పోషణ పక్వాడ నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాసన చేశారు.

చిరుధాన్యాల వినియోగం పెరగాలి

తొగుట(దుబ్బాక): ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు ఆహారంలో చిరుధాన్యాల వినియోగం పెరగాలని ఐసీడీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ చంద్ర ప్రకాష్ అన్నారు. దుబ్బాక ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని తుక్కాపూర్‌లో సెక్టార్ పోషణ పక్వాడ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుకులు పరుగుల జీవితంలో అందరూ పోషకాహారానికి దూరమవుతున్నారన్నారు. చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని, వాటిని ఆహారంలో తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు, చిన్నారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలతో పోషకాహారం అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతీ ఒక్కరికి కాంగ్రెస్ పథకాలు అందుతాయని, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గుర్రాలగొంది నుంచి వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పాస్‌పోర్ట్ పోయినది

చంద్రన్న సుబ్బన్న సిర్పుల తండ్రి సుబ్బన్న R/o H.No.1-64, దొంగల ధర్మారం గ్రామం, అక్కన్నపేట మండలం, సిద్దిపేట జిల్లా, తెలంగాణకు చెందిన నేను 04-10-2022న జారీ చేయబడి 03-04-2023న ఎక్స్‌పైర్ తేదీ గల X0900149 గల పాస్‌పోర్ట్ కలిగి ఉన్నాను. అట్టి పాస్‌పోర్ట్ పోయినది. దాని గురించి వెతకగా దొరకలేదు. దొరికినవారు ఈ సెల్ నెంబర్ 9989751966 కు తెలియజేయగలరు.

నిధులు మంజూరుకు వినతి



వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణ కేంద్రం నుంచి శబాష్‌గూడెం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి పలువురు వినతి పత్రం ఇచ్చారు. గురువారం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యేను చిట్యాలలో కలిసిన కడవేర్గు, పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి, నాగపురి, శబాష్ గూడెం గ్రామస్తులు డబుల్ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయించాలని వినతి పత్రం అందించారు. అంతకు ముందు ఎమ్మెల్యే దానంపల్లిలో గంగమ్మకు పూజలు చేశారు. చిట్యాలలో జరిగిన చర్చి వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, కడవేర్గు ఎంపీటీసీ గదరాజు యాదగిరి, చిట్యాల మాజీ సర్పంచ్ రామ్మోహన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు అంతుల మల్లేశం, నాయకులు బండమీది కరుణాకర్, గదరాజు చందు, జింకల పర్వతాలు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి

మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి



పారిశుద్ధ్య పనులపై ఆరా తీస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి

సిద్దిపేటజోన్: స్వచ్ఛ్ సిద్దిపేట లక్ష్యంగా పారిశుద్ధ్య విభాగం సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. మురుగు రోడ్డుపైకి రాకుండా మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. కాల్వల్లో చెత్తా చెదారం తొలగించి నీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఆయా వార్డుల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఈదురుగాలులకు విరిగిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్‌ను ఆదేశించారు.

అక్రమ వెంచర్‌ను తొలగించండి



వినతి పత్రం ఇస్తున్న ధర్మారం ఎంపీటీసీ శ్రీనివాస్

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని ధర్మారంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్ వారిపై చర్యలు తీసుకోవాలని ధర్మారం ఎంపీటీసీ చెప్యాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్‌ను తొలగించడంతో పాటు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎంపీడీఓ గణేష్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే లక్ష్యం సాధిస్తాం

బెజ్జంకి(సిద్దిపేట): విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావంతో విద్యనభ్యసిస్తే తాము కోరుకున్న లక్ష్యాలను సాధిస్తారని రిటైర్డ్ ప్రిన్సిపాల్, లయన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బెజ్జంకి శివారు ఎల్లంపల్లి మోడల్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ సహకారంతో కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాంను గురువారం నిర్వహించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చిత్రకళా రూపంలో ప్రదర్శించారు. అనంతరం వక్తలు విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు నారోజు శంకరాచారి, అక్షర గణిత సమ్రాట్ పుల్లూరి ప్రభాకర్, ప్రిన్సిపాల్ హరిత్‌కౌర్, సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ ఉపాధి హామీ కూలీ బకాయి చెల్లించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): జిల్లాలో ఉపాధి హామీ బకాయి కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్ డిమాండ్ చేశారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో గురువారం ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండలో పని చేస్తున్న కూలీలకు ఆయన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పని కల్పించడంతో పాటు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు.

◆ నత్తనడకన ఉపాధిహామీ పనులు

కొమురవెల్లి(సిద్దిపేట): ఉపాధి హామీ పనులు మండలంలో నత్త నడకన సాగుతున్నాయని దళిత బహుజన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి ఏగోండ స్వామి గురువారం అన్నారు. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1875 జాబ్ కార్డు ఉన్న కుటుంబాలకు ఉపాధి హామీ పని కల్పిస్తే కేవలం 52 మంది మాత్రమే వంద రోజుల పని చేశారన్నారు. పని చేసినా కూలీలకు సకాలంలో కూలీ చెల్లించడంలేదని ఆరోపించారు. దీంతో ఉపాధి పనులు చేసేందుకు ఆసక్తి చూపడంలేదన్నారు.

◆ అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్ యాదవ్



ములుగు (గజ్వేల్): అఖిల భారత యాదవ మహా సభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ములుగు మండలం బహిలంపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన పల్లె రమేష్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్ యాదవ్ గురువారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ యాదవులను ఏకతాటిపైకి తీసుకొచ్చి సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ బీజేపీ అధికార ప్రతినిధిగా సాయికిరణ్

చిన్నకోడూరు(సిద్దిపేట): బీజేపీ మండల అధికార ప్రతినిధిగా మైలారం గ్రామానికి చెందిన ఏనుగుల సాయికిరణ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం మండల పార్టీ అధ్యక్షుడు సూరగోని శేఖర్ గౌడ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ గౌడ్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. మెదక్‌లో బీజేపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.

◆ మృతుడి కుటుంబానికి చేయూత

గజ్వేల్‌రూరల్: నిరుపేద కుటుంబానికి స్వచ్ఛంద సంస్థ సభ్యులు చేయూతనందించారు. మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకు చెందిన మర్కంటి బాల్‌రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబానికి చెలిమి ఫౌండేషన్ తమ 61వ సేవా కార్యక్రమంలో భాగంగా నిత్యావసరాలు, రూ.11,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో చెలిమి ఫౌండేషన్ అధ్యక్షుడు తులసీదాస్, ఉపాధ్యక్షుడు యాదగిరి, కోశాధికారి ఆనంద్, సభ్యులు పాల్గొన్నారు.

◆ పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల పరిధి బంజేరుపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నవారిని బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ అపూర్వరెడ్డి గురువారం తెలిపారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.7,330 నగదు, ఏడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ రైస్, గంజాయి రవాణా చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.